సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023




**సింహగిరికి పోటెత్తిన భక్తులు**
వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో సింహగిరి కిటకిటలాడింది. 8లో



**హృదయాలు కదిలె..**
ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం(అలుమ్ని) శనివారం సందడిగా జరిగింది. 8లో



**కొలువుదీరనున్న గురువులు!**
డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు కొలువులు దక్కే తరుణం ఆసన్నమైంది. కొత్త గురువులు త్వరలోనే స్కూళ్లలో కొలువుదీరనున్నారు. 10లో




## న్యూస్‌రీల్

### 'షిప్‌మంత్ర'తో ఇంటి నుంచే కార్గో సేవలు

**మద్దిలపాలెం:** ఇంటి నుంచే కార్గో సేవలందించేందుకు ఆర్టీసీ తీసుకొచ్చిన 'షిప్‌మంత్ర'ను వినియోగించుకోవాలని మద్దిలపాలెం సిటీ డిపో మేనేజర్ అరుణకుమారి కోరారు. పార్సిల్ కౌంటర్‌కు రాకుండానే షిప్‌మంత్రలో బుక్ చేసుకుంటే.. ఇంటి వద్దకే వచ్చి పార్సిల్ పికప్ చేసుకుని డోర్ డెలివరీ చేస్తామన్నారు. 24 గంటల్లోనే పంపించడానికి ఫాస్ట్ సర్వీస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సదుపాయం విశాఖ నగరం నుంచి రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ఉందన్నారు. తక్కువ ధరలతో ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://www.shipmantra.comను సంప్రదించవచ్చు.

### క్రికెట్ వేసవి శిక్షణ శిబిరానికి 19 నుంచి ఎంపికలు

**విశాఖ స్పోర్ట్స్:** క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ఎంపిక చేయనున్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో అండర్–16, 25న అండర్ 10, 27న అండర్–12 విభాగాల్లో ఎంపికలు జరగనున్నాయి. అర్హులైన వారు వైఎస్సార్ స్టేడియం, మున్సిపల్ స్టేడియంలో ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం చూపి పేర్లు నమోదు చేసుకోవాలని వీడీసీఏ కార్యదర్శి పార్థసారధి సూచించారు.

### గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**మధురవాడ:** మారికవలసలో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్ చెప్పారు. ఇక్కడ 80 సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల ఎస్టీ విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2010 జూన్ 1 నుంచి 2014 జూన్ 31 మధ్య జన్మించి, 2022–23లో 4వ తరగతి పాసైన వారు అర్హులని, ప్రవేశ పరీక్ష మే 15 ఉంటుందన్నారు.

### నయనం.. అభయం

- ఆరోగ్యశ్రీ ద్వారా 51 శాతం కంటి శస్త్ర చికిత్సలు
- శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు

**సింహాచలం:** వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి 51 శాతం శస్త్ర చికిత్సలు చేసిందని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఎ.విజయ్‌కుమార్, ఎ.కృష్ణకుమార్ శనివారం తెలిపారు. అలాగే 2022–23లో 32,924 కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి, రికార్డు స్థాయిలో అవుట్ పేషెంట్లను పరీక్షించామన్నారు. ఆసుపత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4,08,473 కంటి ఆపరేషన్లు, 2512 క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 16,833 మందికి శస్త్రచికిత్సలు, 2022–23లో 1,70,167 మంది అవుట్ పేషెంట్లకు వైద్యం చేశామన్నారు. ఆసుపత్రి కమ్యూనిటీ ఐకేర్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగుతో పాటు జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమం ద్వారా విస్తృతమైన కంటి సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, డైరెక్టర్లను అభినందించారు. సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులు చేస్తున్న కృషిని కొనియాడారు.

# సరస్వతి నిలయంలో 'విదేశీ' సాగు



- ఖాళీ సమయంలో ఏయూలో వ్యవసాయం చేస్తున్న వియత్నాం విద్యార్థులు
- ఆకుకూరలు, ఔషధ మొక్కల పెంపకం



తోటపని చేస్తున్న వియత్నాం విద్యార్థులు

**ఏయూక్యాంపస్:** విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమాహారం ఆంధ్ర విశ్వ విద్యాలయం. విద్యనభ్యసించడానికి పలు దేశాల నుంచి విద్యార్థులు తరలిరావడంతో మినీ ప్రపంచమే ఇక్కడ కనిపిస్తుంది. విదేశీ విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయం చేస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు వివిధ రకాల ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుతూ.. హాస్టల్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం పంచే మొక్కల పెంపకాన్ని వీరంతా అలవాటుగా మార్చుకున్నారు.

ఏయూలో వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నారు. వీరంతా ఎంవీపీకాలనీలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహంలో ఉంటున్నారు. ఈ దేశ విద్యార్థులు బౌద్ధ మతాన్ని ఆచరిస్తూ.. శాఖాహారులుగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో సూప్, సలాడ్, రైస్ వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం పండ్లు ఆహారంగా స్వీకరిస్తారు. సాయంత్రం 6–7 గంటల సమయంలో సాత్విక ఆహారాన్ని తీసుకోవడం వీరి దినచర్యలో భాగం. కొన్ని సమయాల్లో బ్రెడ్, ఫ్రైడ్ నూడిల్స్, పాలు, పన్నీర్ కూడా తీసుకుంటారు. తమ ఆహారంలో వినియోగించే వాము ఆకు, మిరప, ఉల్లి, బొప్పాయి, లెమన్ గ్రాస్‌తో పాటు వియత్నాంకు చెందిన జపనీస్ లేతూస్, బొంగాన్, కటుక్, తాయి బాసిల్, తియ్య దుంపలు(ఎర్ర దుంపలు) వంటివి ఇక్కడ పండిస్తున్నారు. ఎర్రదుంపల ఆకులు, లెమన్ గ్రాస్, జపనీస్ లేతూస్, బొంగాన్ ఆకులను సూప్‌ల తయారీకి వినియోగిస్తున్నారు. తమలపాకును పోలి ఉండే బొంగాన్ ఆకుల్లో ఆహారం ఉంచి ఉడికించడం వల్ల మంచి వాసన వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.

**హాస్టల్.. హరితమయం**

వియత్నాంలో సాగుచేసే పలు రకాల ఆహార, ఔషధ మొక్కలను తమతో పాటే తీసుకొస్తున్నారు. మొదట్లో కుండీల్లో పెంపకం చేపట్టారు. తర్వాత హాస్టల్ అధికారుల సహకారంతో వసతి గృహ ప్రాంగణంలో సాగు చేయడం ప్రారంభించారు. నీరు పోయడం, కలుపు తీయడం వీరి నిత్యకృత్యంలో భాగంగా మారిపోయింది. ప్రకృతికి దగ్గరగా ఉండటం, శాకాహారం తీసుకోవడం, సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించడం తమకు ఆనందానిస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే తమ గదుల వద్ద కూడా మనీప్లాంట్, స్నేక్ ప్లాంట్‌తో పాటు వివిధ అలంకరణ మొక్కలను పెంచుతూ హరితమయంగా తీర్చిదిద్దారు.

### ప్రకృతితో జీవించాలి



ప్రకృతికి దగ్గరగా, ప్రకృతితో మమేకమై జీవించడం అలవాటు చేసుకోవాలి. మేము పూర్తిగా శాకాహారం తీసుకుంటాం. ఖాళీ సమయంలో హాస్టల్ ప్రాంగణంలో ఆకుకూరలు పండిస్తున్నాం. ఇందులో ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. వీటితో సలాడ్, సూప్ వంటివి తయారు చేసుకుంటాం.

– వో థి హా, వియత్నాం పరిశోధకురాలు

### వాతావరణంలో సారూప్యత



భారత్, వియత్నాం దేశాల మధ్య వాతావరణంలో సారూప్యత ఉంది. వియత్నాంలోని సైగాన్ నగరం దాదాపుగా విశాఖను పోలి ఉంటుంది. దీంతో మాకు ఇక్కడ ఉండటం సులభమైంది. ప్రజలు కూడా మంచి స్నేహభావంతో మెలుగుతారు. కొన్ని మొక్కలను వియత్నాం నుంచి ఇక్కడకు తీసుకొచ్చి పెంచుతున్నాం.

– లాన్, వియత్నాం పరిశోధకురాలు

### నిజాయితీగా జీవిస్తారు



భారతీయ ప్రజలు నిజాయితీగా జీవిస్తారు. హాస్టల్‌లో వసతి, సహకారం చాలా బాగున్నాయి. ఇక్కడ కూడా చాలా మంది శాకాహారం తీసుకోవడం చూస్తున్నాం. ఆనందంగా ఉంది. వియత్నాంలో పండించే పలు రకాల మొక్కలను తీసుకువచ్చి ఇక్కడ పెంచుతున్నాం.

– డిన్, జర్నలిజం పీజీ విద్యార్థిని

# పోలీస్ కమిషనర్‌గా త్రివిక్రమ్ వర్మ

- ప్రస్తుత సీపీ సిహెచ్.శ్రీకాంత్ సీఐడీ ఐజీగా బదిలీ
- నూతన డీసీపీగా వాసన్ విద్యాసాగర్ నాయుడు
- ఎస్‌ఐబీ ఎస్పీగా ప్రస్తుత డీసీపీ సుమిత్ సునీల్ గరుడ్



త్రివిక్రమ్ వర్మ  విద్యాసాగర్ నాయుడు

**దొండపర్తి(విశాఖ దక్షిణ):** విశాఖ నూతన పోలీస్ కమిషనర్‌గా సి.ఎం.త్రివిక్రమ్ వర్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు సీపీగా విధులు నిర్వర్తించిన సీహెచ్.శ్రీకాంత్ సీఐడీ ఐజీగా బదిలీ అయ్యారు. అలాగే డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా ఉన్న సుమిత్ సునీల్ గరుడ్‌ను ఎస్‌ఐబీ ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో 2016 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఉన్న వాసన్ విద్యా సాగర్‌నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

**ఏడాదిలో అనేక సంస్కరణలు**

విశాఖ పోలీస్ కమిషనర్‌గా సిహెచ్.శ్రీకాంత్ సరిగ్గా ఏడాది క్రితం ఏప్రిల్ 3వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు చేపట్టారు. నగరంలో నేరాల నియంత్రణ కోసం సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసే ముఠాకు చెక్ పెట్టారు. ఆయన ఆదేశాలు, సూచనల మేరకు గాజువాకలో డ్రగ్స్ కేసులో పోలీసులు చేపట్టిన దర్యాప్తు ఆధారంగానే మాదక ద్రవ్యాలు రవాణా చేసే పాన్ ఇండియా ప్రధాన నిందితుడు అలెక్స్ వాన్‌ను ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్‌ను పటిష్ట పరిచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులతో సంయుక్తంగా గంజాయి ముఠాలపై దాడులు నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి విధులను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే దిశ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో వేగవంతంగా దర్యాప్తు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. సైబర్ నేరాలపైన ప్రత్యేక దృష్టి సారించారు. ఇతర రాష్ట్రాల ద్వారా నెట్‌వర్క్ నడిపే నేరగాళ్లను సైతం అరెస్ట్ చేసి విశాఖకు తీసుకువచ్చి జైలుకు పంపించారు. ప్రతి స్టేషన్‌లోను ప్రత్యేకంగా సైబర్ వారియర్స్ అనే వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. స్పందనతోపాటు ప్రత్యేకంగా డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ సాండ్ పెట్రోలింగ్ ద్వారా విశాఖ బీచ్‌లో పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలివ్వడంతో ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టాయి.

### సమర్థవంతమైన అధికారిగా త్రివిక్రమ్ వర్మకు గుర్తింపు

2005 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పనిచేసిన చోట సమర్థవంతమైన అధికారిగా పేరు సంపాదించారు. వాస్తవానికి వైద్య విద్యను అభ్యసించినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న ఈయనకు విశాఖతో కూడా అనుబంధం ఉంది. 2015లో విశాఖ డీసీపీగా విధులు నిర్వర్తించారు. సీఐడీ డీఐజీగా, ప్రకాశం జిల్లా ఎస్పీ, విశాఖ డీసీపీ,, ఏపీఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంట్, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ, రంపచోడవరం ఏఎస్పీ, నర్సీపట్నం ఓఎస్‌డీగా విధులు నిర్వర్తించారు. ఈయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

### మన్యం నుంచి విశాఖ డీసీపీగా..

డీసీపీగా నియమితులైన వాసన్ విద్యా సాగర్‌నాయుడు 2016 ఐపీఎస్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన విద్యాసాగర్ నాయుడు 2013లో బీటెక్ పూర్తి చేశారు. 2015లో రెండో ప్రయత్నంలో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. 2016లో చింతపల్లి ఏఎస్పీగాను, 2019లో గ్రే హౌండ్స్(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్పెషలైజ్డ్ యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్స్ ఫోర్స్) అసాల్ట్ కమాండర్‌గాను, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగాను విధులు నిర్వర్తించారు. విశాఖ డీసీపీగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి నిందితుడి పరారీ



పరారైయిన సత్తిబాబు

**సీతమ్మధార:** గంజాయి తరలింపు కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఓ వ్యక్తి స్టేషన్ నుంచి బేడీలతో పరారయ్యాడు. ఫోర్త్‌టౌన్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన పోలీసులను ఉలిక్కి పడేలా చేసింది. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు బృందాలుగా ఏర్పడి.. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. లిక్విడ్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం రైల్వేస్టేషన్ దరిలో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చిన్నపాచిల గ్రామానికి చెందిన పప్పు నూకరాజు, చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సియాదుల సత్తిబాబును పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 2 లీటర్ల లిక్విడ్ గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. శుక్రవారం రాత్రి వారు పోలీస్ కస్టడీలో ఉండగా.. ఏఎస్‌ఐతో పాటు మరో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు వారికి కాపలాగా ఉన్నారు. శనివారం ఉదయం మరుగుదొడ్డికి వారిని తీసుకెళ్లే క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. సత్తిబాబు బేడీలతోనే మహిళా కానిస్టేబుల్ జయలక్ష్మిని తోసేసి పరారయ్యాడు. నూకరాజు పరుగెత్తలేక పోలీసులకు దొరికిపోయాడు. కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో బేడీలతో సత్తిబాబు స్థానికులకు కనిపించడంతో పట్టుకోవడానికి ప్రయత్నించగా.. అక్కడ నుంచి పరుగులు తీశాడు. ఈస్ట్ ఇన్‌చార్జి ఏసీపీ వివేకానంద ఘటనపై విచారణ చేపట్టారు.

# రెండో రోజూ అదే జోరు

చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు' సర్వే



ఫ్లకార్డులు చూపిస్తున్న మహిళలు



58వ వార్డులో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్

**సాక్షి, విశాఖపట్నం:** 'జగనన్న మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ఇంటింటా సర్వే చురుగ్గా సాగింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని సర్వేకు సంబంధించిన సమాధానాలు పొందుపర్చారు. గృహ యజమాని అనుమతితో ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్లు అతికించారు. 14 రోజుల పాటు 'జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం జరగనుంది.

# సాయం చేస్తే.. ఫోన్లు కొట్టేశాడు



పోలీసులు స్వాధీనం చేస్తున్న ఫోన్లు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ(క్రైం) నాగన్న

- బైక్ దొంగ కోసం గాలిస్తే సెల్‌ఫోన్ల దొంగ దొరికాడు
- రూ.5.50 లక్షలు విలువ చేసే 42 మొబైల్స్, బైక్ స్వాధీనం
- కొత్తవలసకు చెందిన గంటా ఎలియా అరెస్ట్
- మరో ఇద్దరి కోసం గాలింపు

**దొండపర్తి(విశాఖ దక్షిణ):** బైక్ దొంగ కోసం దర్యాప్తు చేస్తే మొబైల్స్ చోరీ వ్యవహారం వెలుగుచూసింది. జల్సాల కోసం బైక్‌లు చోరీ చేస్తూ.. బైక్‌పై వెళుతూ పడిపోతున్నట్లు నటిస్తూ.. సాయం చేయడానికి వచ్చిన వారి నుంచి మొబైల్స్‌ను దొంగలించే ఘరానా దొంగను హార్బర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి బైక్‌తో పాటు 42 స్మార్ట్ ఫోన్లు, ఒక ఆపిల్ ఐపాడ్, 5 కీపాడ్ మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడితో పాటు చోరీలకు పాల్పడిన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ(క్రైం) జి.నాగన్న తెలిపారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. పెందుర్తి మండలానికి చెందిన అంగటి భాను ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన ఉదయం 10 గంటలకు కాన్వెంట్ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద తన పల్సర్ బైక్ పార్క్ చేసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లాడు. తిరిగి 11 గంటలకు వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో అతడు కొద్ది రోజులు బైక్ కోసం వెతికి దొరకకపోవడంతో అదే నెల 26వ తేదీన హార్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా కొత్తవలసలో 202 కాలనీకి చెందిన గంటా ఎలియా ఈ బైక్ చోరీ చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో ఎలియాను కాన్వెంట్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా బైక్ దొంగతనంతో పాటు మొబైల్స్ చోరీ చేసినట్లు కూడా అంగీకరించాడు.

అతడు మొబైల్స్ చోరీ చేసే విధానాన్ని చెప్పడంతో పోలీసులు సైతం విస్మయానికి గురయ్యారు. బైక్‌పై వెళుతూ పడిపోతున్నట్లు నటించిన సమయంలో సాయం చేయడానికి వచ్చే వారి పాకెట్ నుంచి మొబైల్స్‌ను చాకచక్యంగా కొట్టేసినట్లు అంగీకరించారు. ఇలా అతడు చోరీ చేసిన రూ.5.5 లక్షలు విలువ చేసే 42 స్మార్ట్‌ఫోన్లు, ఒక ఆపిల్ ఐపాడ్, 5 కీపాడ్ మొబైల్స్‌ను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎలియాను అరెస్ట్ చేశారు. ఈ చోరీల్లో మరో ఇద్దరి పాత్ర కూడా ఉన్నట్టు తెలుసుకొని వారి కోసం గాలిస్తున్నారు. ఈ కేసును చేధించిన హార్బర్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎం.అవతారం, సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్‌ఐ డి.సూరిబాబు, ఏఎస్‌ఐ ఆయూబ్‌ఖాన్, మల్కాపురం క్రైం హెచ్‌సీ ఎస్.మురళి, కానిస్టేబుల్ సి.హెచ్.శ్రీను, హార్బర్ క్రైం కానిస్టేబుల్ ఎం.కె.వేణుగోపాల్‌లను డీసీపీ(క్రైం) జి.నాగన్న అభినందించారు.

### చైన్ స్నాచర్ల కోసం మూడు బృందాలు

మూడు రోజుల క్రితం నగరంలో మూడు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించారు. వారు మహారాష్ట్రలో థానే దగ్గర కల్యాణ్ అనే గ్రామానికి చెందిన వారుగా నిర్ధారణకు వచ్చారు. వారిని పట్టుకొనేందుకు పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు థానేకు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో స్నాచింగ్‌కు పాల్పడిన వారి కోసం గాలిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి ఆ ముగ్గురు వ్యక్తులు ఐదు రోజుల క్రితమే ఒకే రైలులో వేరువేరుగా విశాఖకు వచ్చి ఒక లాడ్జిలో దిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వారు ఇక్కడ బైక్‌ను చోరీ చేసి దాని మీదే ఈ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. పోలీసులు ముందు బైక్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేయగా చోరీ చేసిన బైక్‌పై వచ్చి ఈ స్నాచింగ్‌లు చేసినట్లు గుర్తించారు. అలాగే వారు నేరుగా ఇక్కడి నుంచి రైలులో వెళ్లిపోయినట్లు తెలుసుకొని వెంటనే విశాఖ పోలీసులు మహారాష్ట్రకు పయనమయ్యారు. స్నాచింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని డీసీపీ(క్రైం) జి.నాగన్న తెలిపారు.

# హెచ్‌పీసీఎల్ వైద్య పరికరాల వితరణ

మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలను వైద్యాధికారి సీతారామలక్ష్మికి హెచ్‌పీసీఎల్ సీఈవో వరప్రసాద్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంతో రూ.1.20 లక్షలతో వీటిని సమకూర్చామన్నారు. వాటిలో ఈసీజీ మెషన్, ఆపరేషన్ థియేటర్‌లో వినియోగించే ఓటీ లైట్, మల్టీపెరా మిషన్, సీటీజీ మెషీన్, రోగులను పరీక్షించేందుకు అవసరమైన టేబుల్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు



వైద్యాధికారికి పరికరాలను అందిస్తున్న సీఈవో వరప్రసాద్

## మన్యంలో నేడు స్వాత్మానందేంద్రస్వామి పర్యటన

సాక్షి,పాడేరు: విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి ఆదివారం పాడేరు, హుకుంపేట మండలాల్లో పర్యటించనున్నారు. హుకుంపేట మండలంలోని తడిగిరి పంచాయతీ, ఉక్కుర్బ గ్రామంలోని స్వయంభూ భీమలింగేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సావానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.ఉదయం 8.30గంటలకు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 9గంటలకు ఉక్కుర్బ గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రసాద విక్రయశాల, అన్నదాన భవనం వద్ద భక్తులు బారులుదీరారు. ద్విచక్ర వాహనాలు, కార్ల రాకతో ఎక్కడపడితే అక్కడ పలుమార్లు ట్రాఫిక్ సమస్య నెలకొంది.

## అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పెదగంట్యాడ: కుమార్తెపై అత్యాచారం చేసిన ఘటనలో తండ్రిని న్యూపోర్టు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతనిపై రేప్, పోక్సో కేసులు నమోదు చేశారు. వివరాలివీ.. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న చోడిపిల్లి ముత్యాలరావు(42) తన కుమార్తె (15)పై అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. గంగవరం గ్రామానికి చెందిన అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఆదివారం అతన్ని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ సువ్వారి రాము తెలిపారు.

## అనకాపల్లి ఎస్పీగా మురళీకృష్ణ

**ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమి సాలి బదిలీ**

సాక్షి, అనకాపల్లి: జిల్లా ఎస్పీగా కె.వి.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ఎస్ఐబీలో ఐఎస్‌వో(ఇంటర్‌స్టేట్ ఆపరేషన్స్)గా పనిచేస్తున్నారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న 2017 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన గౌతమి సాలిని విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఎస్పీ మురళీకృష్ణ నెల్లూరులో శిక్షణ పొందారు. రాజమండ్రి సీఐడీ డీఎస్పీగా, తిరుపతి డీఎస్పీగా, తిరుమల అడిషనల్ ఎస్పీగా, ఇంటెలిజెన్స్ ఎస్పీగా గతంలో విధులు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన స్వగ్రామం పార్వతీపురం.


మురళీకృష్ణ

# హృదయాలు కదిలె.. జ్ఞాపకాలు మిగిలె..

- నందడి చేసిన ఏవీఎన్ పూర్వ విద్యార్థులు
- కళాశాల అభివృద్ధే ధ్యేయంగా అలుమ్ని మీట్

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం(అలుమ్ని) శనివారం సందడిగా జరిగింది. 60, 70 ఏళ్ల కిందట చదివిన వారి నుంచి ఇటీవలే పాసవుట్ అయిన విద్యార్థులంతా మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. మరుపురాని మధుర క్షణాలతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలపరిచి, కళాశాల అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థి, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్, డాక్టర్ గోపిచంద్, ఇమంది శంకరరావు, పార్థసారథి, ఏయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వీవీజీ గోపాలకృష్ణ, 1952 నుంచి 2019 వరకు చదివిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు

### కళాశాలకు సేవలందిస్తూనే ఉంటా..



ఏవీఎన్ కళాశాల స్థాపించిన నాటికి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ లేదు. 1860లో ఏవీఎన్ ఉన్నత పాఠశాల ప్రారంభించారు. 1878లో కళాశాల ప్రారంభమైంది. 1978 బ్యాచ్ విద్యార్థిని. కళాశాలలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వారిలో ప్రథముడిని. విద్యాబుద్ధులు చెప్పిన కళాశాలకు సేవలందిస్తూనే ఉంటా..

– వై.అక్కునాయుడు, విశ్రాంత టెక్నికల్ అండ్ స్టోర్స్ ఆఫీసర్, డీసీఐ

### కళాశాల అభివృద్ధి కృషి చేశా..



ఏవీఎన్ కళాశాల.. మా తలరాతలు సరిదిద్ది ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన చదువులమ్మ తల్లి. మా బ్యాచ్ విద్యార్థులంతా ఉన్నత స్థాయిలో ఉండటం గర్వంగా ఉంది. కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మా సంస్థ నుంచి రూ.40లక్షలు మంజూరు చేసి.. కళాశాల అభివృద్ధికి నా వంతుగా కృషి చేశా.

– ఎస్‌వీఎస్ రామ్‌సాయి, విశ్రాంత ఈడీ(ఫైనాన్స్), ఐవోసీఎల్

### చాలా ఆనందంగా ఉంది



నా స్నేహితుల్లో చాలా మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. 45 ఏళ్ల తర్వాత కలుసుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. మేము చదువుకున్న రోజుల్లో మంచి ఫ్యాకల్టీ ఉండేది. ఇక్కడ చదివిన వారంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆ రోజుల్లో కళాశాలలో సీటు లభించడమే అదృష్టం.

– కొత్తపల్లి వెంకటరామయ్య, విశ్రాంత సీనియర్ మేనేజర్(సేల్స్), ఐవోసీఎల్

### ఇక్కడే చదివా.. ఇప్పుడు ప్రిన్సిపాల్‌గా...



ఇక్కడే చదివాను. ఇక్కడే అధ్యాపకుడిగా చేరాను. ఎస్ఎస్ఎస్ పీవో, కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా.. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్నా. కళాశాలలో క్రమశిక్షణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లలు రాణిస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు లక్ష్యం మేరకు కళాశాలను మరింత ముందుకు తీసుకెళ్తున్నాం.

– మొజ్జాడ సింహాద్రినాయుడు, ప్రిన్సిపాల్, ఏవీఎన్ కళాశాల

### ఇలా కలుసుకోవడం ఓ అనుభూతి



పాత మిత్రులను కలుసుకోవడం ఓ అనుభూతి. అందర్నీ చూడగానే కళాశాల రోజులు గుర్తొచ్చాయి. స్నేహభావాన్ని కొనసాగించడం అరుదైన విషయం. స్నేహితుల్లో ఎవరికైనా కష్టం వస్తే కలిసి ఆదుకుంటున్నాం. మా ఉన్నతికి అధ్యాపకులు దోహదపడ్డారు. వారు చూపిన బాటలో నడుస్తున్నాం.

– 1991–94 బీకాం సెకండ్ షిఫ్ట్ విద్యార్థులు

### కళాశాల.. ఓ కుటుంబం



ఏవీఎన్ కళాశాలకు 160 ఏళ్ల పైగా ఘన చరిత్ర ఉంది. కళాశాలకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా.. కళాశాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నా. కళాశాల ఓ కుటుంబం వంటిది. ఇక్కడ చదివిన వారమంతా ఐకమత్యంతో ముందుకు సాగుతున్నాం.

–అజ్జరపు సర్వేశ్వరరావు, అలుమ్ని అధ్యక్షుడు, ఏవీఎన్ కళాశాల

### ఆ రోజుల్లో టాపర్‌గా నిలిచా..



ఏవీఎన్ కళాశాలలో చదివి 1971లో పాసవుట్ అయ్యా. ఆ రోజుల్లో కళాశాల టాపర్‌గా నిలిచా. ఏయూ పరిధిలో 11వ ర్యాంకు సాధించా. నెక్ ఛైర్మన్‌గా కళాశాలకు విచ్చేశా. నా కన్నా సూపర్ సీనియర్లను చూశా.. ఎంతో ఆనందంగా ఉంది. నా సహకారం కళాశాలకు ఎప్పుడూ ఉంటుంది.

– ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఉపకులపతి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం

### నా ఉన్నతికి దోహదపడింది



నా ఉన్నతికి ఏవీఎన్ కళాశాల దోహదపడింది. 1978–81లో డిగ్రీ చదివాను. అప్పట్లో కళాశాల యూనియన్ ప్రెసిడెంట్‌గా చేశా. ఆ తర్వాత న్యాయవాది వృత్తి కొనసాగించా. కోల్‌కతా డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ జడ్జిగా విధులు నిర్వహించి గతేడాది పదవీ విరమణ చేశా. ఏవీఎన్ కళాశాల అలుమ్ని అధ్యక్షుడిగా సేవలందించా. కళాశాలలో రూ.6లక్షలతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశాం.

–మాకేన శ్రీనివాసరావు, విశ్రాంత జడ్జి, 1978–81 పూర్వ విద్యార్థి